వారి కవిత్వాల చాటున వారి భయంకరమైన లేకితనం క్షణ క్షణమూ బయటపడుతూనే వుంటుంది.

"నువ్వు రూమ్‌లోనే వున్నావా? బైటికి పోలేదా?" అంటూ లోపలికి వచ్చాడు సుధాకర్, పూర్వ్యంకన్నా కొంచెం కొత్తగా-రామారావు శెలవు వొచ్చీరాగానే హాస్టల్ రూమ్‌కి తాళంపెట్టి బైటికి పరిగెత్తే రకం కాడని తెలిసికరాడా.

సుధాకర్‌ని చూడగానే నవ్వు మొహంతో రామారావు "లేదులే, రా! రా! ఇప్పుడే పడుకుని లేచాను. అందరూ పోయి వటున్నారే!" అంటూ చేతిలో నవల పక్కనపెట్టి మిత్రుణ్ణి ఆహ్వానించాడు.

సుధాకర్ తనకు స్నేహితు డనుకుంటే రామారావుకెంతో సంతోషంగా వుంటుంది. కానీ ఆ మాట బైటికి చెప్పడానికి సంకోచిస్తాడు.

## పెద్ద కథ

# బూడిదలో పన్నీరు

### రంగనాయకమ్మ

"సుధాకర్ మీ క్లాస్ మేటట కదా? మీకు బాగా తెలుసా?" అని ఎవరైనా అడిగితే, 'తెలుసు' అని వూరుకుంటాడుగానీ, "నా ఫ్రెండే" అన లేడు—తను అలా చెప్పుకోడం సుధాకర్‌కి నచ్చుతుందో లేదో అనీ, తనకు అంత అర్హత వుందో లేదో అనీ.

సుధాకర్ మంచి కవితలు రాస్తాడు. చాలామంది మెచ్చుకుంటా రతన్ని. ఎక్కువగా ప్రేమ కవిత్వం రాస్తాడు. కవిత్వాలంటే తల తిప్పేసే స్టూడెంట్స్ కూడా అతని కవితలు కొన్నయినా చదివి వుంటారు. లెక్చరర్స్ కూడా అతన్ని గురించి-"కొన్ని బాగా రాశాడు" అనడం విన్నాడు రామారావు. పూలనించి సన్నని పరిమళాలు తేలినట్టుగా, అతని కవితల్లో, ముఖ్యంగా ప్రేమకవితల్లో సున్నితమైన భావాలు కనపడి మనసుకెంతో సంతోషాన్నిస్తాయి.

"డిక్షనరీలన్నీ వెతికి నాజూకు మాటలు పడేస్తేసరి, కవిత్వం ఎంత నాజూగ్గా అయినా తయారవుతుంది" అన్నవాళ్ళని చూసి వాళ్ళ అసూయని చాలా అసహ్యించుకున్నాడు రామారావు చాలాసార్లు.

"డిక్షనరీలు అందరికీ అందుబాటులో లేవా? అందరూ ఆ నాజూకు మాటల కోసం ఎందుకు వెతుక్కోరూ? సుధాకర్ భావాలే మృదువైనవి కాబట్టి, అతను అంత మృదువైన మాటలే వెదికి వెదికి పడేస్తాడు." అని వాదించాడు వాళ్ళతో చాలా సార్లు.

"తెలుగు ఎం. ఎ. వాళ్ళు కవిత్వం రాయడానికే ముంది లేవోయ్" అన్నాడొక సైన్సు స్టూడెంట్ ఒకసారి.

"మేమందరం తెలుగు ఎం. ఎ. వాళ్ళం కాదూ? సుధాకర్ ఒక్కడే ఎందుకు రాస్తున్నాడు?" అనగానే నోరుమూసుకున్నాడా స్టూడెంట్.

సుధాకర్ అంటే కొందరికి జెలసీ వున్నప్పటికీ, సుధాకర్ తమతో స్నేహం చేస్తే అది తమకెంతో కీర్తిగా భావిస్తారు. యూనివర్సిటీ హాస్టల్స్‌లో ఎక్కువమంది స్టూడెంట్స్. తనకేదో కీర్తి రావాలని రామారావు ఆశపడలేదుగానీ, సుధాకర్ లాంటి వ్యక్తి తనని స్నేహితుడిగా గుర్తించాలని మాత్రం చాలా ఆశపడతాడు అతను ఎప్పుడు తన రూమ్‌కి వచ్చినా అది తనకెంతో గౌరవంగా భావిస్తాడు.

గదిలోకి రాగానే గోడమీద కొత్త కేలండర్‌లో నదిలో పడవని చూస్తూ నిలబడ్డ సుధాకర్ తల తిప్పి రామారావుని చూస్తూ "ఈ వారం పత్రికలో నా కవిత చదివావా?" అన్నాడు.

"నీ కోసం ఆకాశం వెతికాను. అన్నదేనా? ఇంకోటి కూడా వచ్చిందా?"

"అదే."

"పొద్దున్నే చదివాను లైబ్రరీలో. చాలా గొప్పగా వుందోయ్. నువ్వెంత సున్నితంగా ఆలోచిస్తావో ననిపిస్తుంది. నీలాంటి కవులు చెపితేనేగానీ అలాంటి భావాలు కలలో కూడా రావు నాలాంటి వాళ్ళకి" అని నవ్వాడు రామారావు.

సుధాకర్ కేలండర్ కాయితాలు తిరగేస్తూ నించున్నాడు.

"మళ్ళీ ఏదైనా పంపావా?

" 'జ్యోతి'లో ఒకటిరావాలివచ్చేవారం.

ఏదో ఒక పత్రికవాళ్ళు అడుగుతూనే వుంటారు. నేనే పంపలేకపోతున్నాను."

"రోజూ ఒకటి రాసెయ్యరాదూ? నీ చేతిలో పనేగా?"

"మూడ్ వుండొద్దూ? ఫీలింగ్స్ రావొద్దూ?"

"నీలాంటివాడికి ఏ చెట్టుని చూసినా, ఏ పుట్టని చూసినా ఫీలింగ్స్ వస్తాయిలే. అందులోనూ మన కేంపస్‌లో! సాయంకాలాలు కేంపస్‌లో తిరుగుతోంటే నాకే కవిత్వం పుట్టుకొచ్చేస్తుందే." అని నవ్వాడు రామారావు.

సుధాకర్ మంచంమీదవున్న నవల తీసి కాసేపు తిరగేశాడు. "నువ్వు చదివాక ఇది నాకివ్వరాదూ?" అన్నాడు.

"కావాలంటే ఇప్పుడే తీసుకో. చాలా బాగుంది. ప్రకృతిని చాలా సహజంగా వర్ణించాడు. "అరె! రోజూ చూసేవేనే ఈ దృశ్యాలన్నీ" అనిపిస్తోంది వర్ణనలు చదువుతోంటే. పెద్దగాలి మైదానం నిండా తెరలు తెరలుగా పరిగెత్తిందంటూ ఒక పేరా ఎంత సహజంగా వర్ణించాడోయ్! ఆశ్చర్యం వేసింది. మిట్టమధ్యాహ్నపు చెట్లనీడల్ని ఎండలోకి పోవొద్దని దగ్గరే వుంచుకున్నాయి. అన్నాడు. ఎంత బాగుందో కదూ? నువ్వు చదివితే ఇంకా ఎంజాయ్ చేస్తావేమో! ఈ వర్ణనలన్నీ తీసికెళ్ళి చదువు."

"ఇప్పుడొద్దులే. తర్వాత తీసుకుంటాను" అని సుధాకర్ పుస్తకం మంచంమీద పెటేసి, మళ్ళీ కేలండర్ వేపు చూస్తూ నించున్నాడు. తల తిప్పి ఏదో చెప్పబోయినట్టు చూశాడు. ఆగాడు. ఎందుకో సందేహించాడు. మళ్ళీ కేలండర్ చూస్తూ హఠాత్తుగా "సుశీల ఉత్తరం రాసిందోయ్" అన్నాడు.

"సుశీలెవరు?"

"సుశీలెవరేమిటి?"

సుశీలెవరన్నాడేగానీ ఆ ప్రశ్న వెనకే సన్నగా, పొడుగ్గా కొంచెం చామనచాయ రంగు అమ్మాయి, పెద్ద పెద్ద కళ్ళు, పెద్ద జడా బాగా పరిచయమైన అమ్మాయి గుర్తొచ్చింది.

"మన సుశీలా?"


"వూఁ"

"వుత్తరం రాసిందా? వూఁ, రాస్తే?"

"మామూలు వుత్తరం కాదు."— సుధాకర్ కొంచెం నవ్వాడు— "ప్రేమలేఖ రాసింది."

ఆశ్చర్యపడ్డాడు రామారావు. "ప్రేమలేఖా?" అనే కుతూహలంతోటీ, "ప్రేమలేఖ సంగతి తనకి చెప్పడం ఏమిటి?" అనే సందేహంతోటీ.

"చూస్తావా?" అంటూ కొంచెం తారట్లాడి సుధాకర్ జేబులోంచి కవరు బైటికి



తీసి రామారావుకి ఇవ్వబోయాడు.

"అబ్బే. నాకెందుకూ ?" అని కంగారు పడ్డాడు రామారావు.

"పర్వాలేదు, చూడు. నేనే ఇసున్నాగ ?" అని సుధాకర్ కవరులోంచి వుత్తరంతీసి రామారావు కివ్వబోయాడు.

రామారావు తిసుకోకుండా "వద్దోయ్! నేనెందుకు చూడ్డం ?" ఇబ్బందిపడ్డాడు.

"అయితే నేనె చదివి వినిపిస్తాలె." అని సుధాకర్ వుత్తరం విప్పి చదవడానికి సిద్ధపడుతోంటే రామారావు సిగ్గుపడిపోయి.

"వొద్దొద్దు. నేనే చదువుతాలె" అని వుత్తరం లాక్కున్నాడు.

సుధాకర్ మళ్ళీ కెలండర్ పేజీలు తిరగేస్తూ బొమ్మలు చూస్తూ నించున్నాడు,

రామారావు చాలా సంకోచపడుతూ. "ఆ అమ్మాయి వుత్తరం నేను చదవడమేమిటి ?" అని నొచ్చుకుంటూ చదవడం మొదలెట్టాడు.

"సుధాకర్ గారూ !

నేను సుశీల నండీ! రోజూ మీకు క్లాసులో కనపడే సుశీలని. మీ కవితలు చదివి మతిపోగొట్టుకుంటూ వుంటాను. "నీకోసం ఆకాశం వెతికాను" కవితలో మీ భావన ఎంత విశాలమో. ఎంత వున్నతమో చూసి మీరంటే భక్తిభావం మరింత స్థిరపరుచుకుంటున్నాను. మీ కవితల్లోని లలితమైన వూహలు నా మనస్సులో ఎప్పుడూ తారట్లాడుతూ వుంటాయి.

"నీకోసం ఆకాశం వెతికాను" కవిత చదువుతోంటే ఎంత సంతోషపడ్డానో అంత నిరుత్సాహ పడ్డాను. ఈ భూమిమీద ఏ అమ్మాయీ యెన్నటికీ మీ హృదయాన్ని ఆకర్షించ లేదేమోనని. మీరు కలలుకనే ఆ స్వప్న సుందరి ఈ భూమి మీద లేనే లేదంటారా ?

నే నెన్నడూ మీతో మాట్లాడలేదు మీరు క్లాసుకి రాకపోతే నాకా పూట క్లాసులో వుండబుద్ధి వెయ్యదు. ఈ మధ్య అయితే నిజంగా నేను మీ కోసమే క్లాసుకి వస్తున్నాను. క్లాసులో మీరు లేకపోతే వెంటనే వెళ్ళిపోయే ధైర్యం లేక అలాగే జీవచ్ఛవం లాగ కూర్చుంటాను గానీ చదువు కోసం కాదు.

మొన్న నొకసారి మీరు లైబ్రరీలో పత్రికలు చూస్తూ కూర్చున్నారు. "మీ కవిత నేను చదివానండీ" అని మీ దగ్గరికి వచ్చి చెప్పాలని యెంత ప్రయత్నించాను! మీరున్న వేపు వచ్చానుకూడా. కానీ. నోరు విప్పలేకపోయాను. ఎంత ప్రయత్నించినా నా కంఠం పెగల లేదు నాకే ఆశ్చర్యం వేసింది కంఠంలో నిజంగా యేమైనా జబ్బు చేసిందేమోనని భయమేసింది. బయటికి వెళ్ళాకకూడా దూరంగా రమణి కనపడితే పిలవాలని ప్రయత్నించి పిలవలేకపోయాను. కళ్ళల్లోంచి జలజలా నీళ్ళొచ్చేశాయి. ఇదంతా నమ్మరేమో మీరు.

వారంరోజుల కిందట మీరుకూడా నన్ను చూశారు బస్‌స్టాప్‌లో. గుర్తుందో లేదో మీకు. మూడో నెంబరు బస్సులో ఎక్కి వెళ్ళారు మీరు. ఆ బస్సు ఎంత పవిత్రం అయిపోయిందో ననుకున్నాను. మీరు ఏ సీటులో కూర్చుంటారో. మీరు దిగిపోయింతర్వాత ఆ సీటులో ఎవరు కూర్చుంటారోనని ఆలోచిసూ రెండు బస్సులు పోగొట్టుకుని ఎప్పటికో ఇంటి కొచ్చాను. అప్పటినించే మూడో నెంబరు బస్సునుచూస్తే ఎంత ఇషమో నాకు! నవ్వుతున్నారా నా మాటలకి ?

పది రోజుల కిందట ఒకసారి నేనూ. రమణీ లాండ్‌స్కేప్ గార్డెన్‌లో చాలా సేపు కూర్చుని వెళ్ళడానికి లేచాం. అంత వింతగా ఎటునించి వచ్చారో మా ముందే మీరు మెట్లు ఎక్కి వెళ్తూ కనిపించారు. మీ పాద స్పర్శసోకిన ఆ మెట్లమీద ఇంక ఎవ్వరీ్ని నడవ నివ్వకూడదనిపించింది. ఆ మెట్ల మీదపడి మెట్టుమెట్టునీ ముద్దు పెట్టుకోవాలనిపించింది. నాకు పిచ్చిపడుతుందేమోనని భయపడ్డాను నిజంగా. ఒకసారి రమణి భుజం మీద చెయ్యివేసి నడుస్తూ దాని భుజం మీద వేళ్ళతో అక్షరాలు రాస్తున్నానట! "ఏమిటే రాస్తున్నావూ ?" అంది. "ఏం రాస్తున్నాను ?" అని తెల్లబోయాను. "'సు అని రాశావు" అంది. ఏం చెప్పాలో తోచక కంగారుపడిపోయాను. నా పేరు సుశీల కాబటిఎలాగో బతికిపోయాను. దానికి నిజం చెప్పాలంటే ఎలా అర్థం చేసుకుంటుందోనని భయం. మీరు నవ్వుతారేమోగానీ ఎప్పుడూ నాకు పెన్ను పట్టుకుని పుస్తకాలనిండా "సుధాకర్. సుధాకర్, సుధాకర్. సుధాకర్" అని రాస్తూనే వుండాలనిపిస్తుంది. మెళుకువలోనూ, నిద్రలోనూ ఎప్పుడూ నా హృదయం సుధాకర్‌నే జపిస్తూవుంటుంది. సిగరెట్లు కాల్చేవాళ్ళని చూస్తే ఇప్పటికీ నాకు అసహ్యమే గానీ మిమ్మల్ని చూస్తే మాత్రం అలా వుండదు. సిగరెట్లు కాల్చడం మీకు అంత ఇషమేమోనని పిస్తుంది. కాల్చే వాళ్ళందరికీ యిష్టమయ్యే కదా కాలుస్తారు? కాని. ఇతరుల్ని గురించి నేనలా సరిపెట్టుకోలేను. మీ ఒక్కరిలోనే నేను తప్పులు పటలేననుకుంటా మిమ్మల్ని ఆరాధించడమే నా జీవితాదర్శమేమో అందుకే నేను పుట్టానేమో ననిపిస్తోంది.

మీ కవితలు కొన్ని ఆల్బమ్‌లో పెట్టి జాగ్రత్త చేశాను. నాకు దొరకని వెన్ని వున్నాయో తెలియదు. ఎప్పుడూ అవి చదువుతూ వుంటాను. "వసంతరాగం" అనే మీ కవితని పాట వరసలో వీణమీద వాయించాలని ఒక రోజంతా ప్రయత్నించి స్వరం కట్టాను. మా సంగీతం మేషారికి చూపిస్తే స్వరం కరెక్టుగానె వుందన్నారు. ఎప్పుడైనా మీ దగ్గర ఆ పాట వాయించి వినిపించాలని నా కోరిక. మీ గురించి నా మనసులో కలిగే వూహలన్ని కాయితాల మీద పెడితే యెన్నివేల లేఖ లవుతాయో! మిమ్మల్ని విసిగిసున్నానేమోమూర్ఖురాల్ని.

ఈ మధ్య గోలెంలో ఒక తెల్ల గులాబీ మొక్క పాతాను. దానికి 'సుధ' అని పేరు పెటాను. ఇంటికి రాగానే "నా సుధ యెలావుంది?" అని ముందు దాని దగ్గరికి పోతాను. ఇంట్లో వాళ్ళందరికీఆశ్చర్యమే. ఆ మొక్కమీద నాకంత ప్రేమేమిటని. నా 'సుధ' రోజూ ఒక్కొక్క ఆకు తొడుగుతూ వుంది. మీరు అనుమతిస్తే నేనిట్లా యుగ యుగాలకూ రాయగలను. మిమ్మల్ని విసిగిస్తున్నానేమోనని భయంగా వుంది. ఇంక ఆపుతాను నావూహల్నీ. నా కలల్నీ. మీకు విసుగు కలిగిస్తే మన్నించరూ ?

ఎన్నటికీ మీ స్నేహాన్నికోరే
మీ సుశీల.

రామారావు కళ్ళు చెమర్చాయి. చప్పున కళ్ళు తుడుచుకున్నాడు. మాట్లాడ లేకపోయాడు.

సుధాకర్ కేలండర్ మీదనించి దృష్టి తిప్పి "చదివావా ?" అన్నాడు.

"వూఁ" అని వుత్తరం మడిచి సుధాకర్ చేతికి ఇచ్చాడు.

"అదేమిటి ? అలా వున్నావేం ?"

"ఛ ! ఏంలేదు" అని తడికళ్ళతో చిరునవ్వు నవ్వాడు.

"ఎలావుంది వుత్తరం ?"

రామారావు మళ్ళీనవ్వి వూరుకున్నాడు.

సుధాకర్ కాసేపు ఆగి "ఎంతదృష్టవంతుడివోయ్! అంటావనుకున్నానే !" అన్నాడు నవ్వుతూ.

"సరే అనాలా ?" అని నేల చూపులు చూశాడు రామారావు.

"వెళ్తాను" అన్నాడు సుధాకర్ కాసేపు నిలబడి.

"మరి జవాబు రాశావా?"

"లేదింకా నిన్న పొద్దున్నే అందింది."

రామారావు చాలా ఆశ్చర్యపడ్డాడు.

"ఏం రాద్దామనుకుంటున్నావు?" అని అడగబోయి మాట ఆపుకున్నాడు

"వెళ్తానోయ్! ఈ సంగతి ఎక్కడా అనకేం ?"

"నేనెందుకంటాను?"

"మాట వరసకి అన్నాలే."

"నువ్వు అనమన్నా అనను."

"ఏం?"

"ఎందుకూ అనడం!"

"సరే వెళ్తా" అని వెళ్ళిపోయాడు సుధాకర్.


రామారావు మళ్ళీ పుస్తకం చేతిలోకి తీసుకున్నాడుగానీ చదవలేకపోయాడు.

తన అడ్రస్ కూడా ఇస్తూ ఉత్తరం రాసింది. ఎంత ధైర్యమో? ఆమె కొచ్చే వుత్తరాలు ఇంట్లో వాళ్ళెవరూ చూడ రేమో!

ఆలోచిస్తోంటే సుధాకర్ ప్రవర్తన అసహజంగా అనిపిస్తోంది. నిన్న అనగా వుత్తరం వాస్తే ఇంకా జవాబివ్వకుండా ఎందుకు వుండాలి? ఇష్టం లేదా? ఆ సంగతైనా తొందరగా చెప్పాలిగా? పాపం ఏమైపోతుందో ఇష్టంలేదని రాస్తే? కాదు. అతను ఇష్టంగానే వున్నట్టున్నాడు. అయినా తనని నమ్మి రాసిన ప్రేమలేఖని ఇంకోవ్యక్తికి చూపించడం ఏమిటి? సుధాకర్ తననంత ఆప్తుడిగా భావిస్తున్నాడా? అతని మనసు నిజంగా ఆనంద సముద్రమైపోయినట్టుంది. సంతోషం ఆపుకోలేక చూపించాడేమో! తప్పేముంది? ప్రేమ అనేది ఒక్క హృదయంలోనే చిలవలూ, పలవలూ వేసి పెరుగుతుందా? రెండో మనిషి భావాలు తొందరగా తెలుసుకోకుండా ఇంత కాలం బాధపడడం ఎందుకో పిచ్చి అమ్మాయి? పైకి ఎంత సామాన్యురాలిగా కనవడుతుంది! మనసులో ఎంత ప్రేమధనమో! మనసుకెంత ప్రేమించే శక్తో! ఎవరి మనసులో ఏం జరుగుతోందో. ఎవరి హృదయమెందుకు కల్లోల పడుతోందో రెండో మనిషి గ్రహించలేడుకదా యెంత దగ్గర వున్నా? నిన్న సుశీల తనకు పక్క బెంచీలోనే కూర్చుంది. ఇప్పుడాలోచిస్తే, గుర్తు తెచ్చుకుంటే సుశీల నిన్న చాలా ముభావంగా వున్నట్టనిపిస్తోంది గానీ, యిప్పుడు అయితే అలా అనిపించనేలేదు.

అవతలవ్యక్తి గాఢంగా ప్రేమిస్తోంది కాబట్టి ఇవతల వ్యక్తికికూడా ప్రేమ కలగవలసిందేనా? కలుగుతుందా అలాగ? అలాంటి వుత్తరంతనకే వస్తే యేమైపోయేవాడో తను? చిక్కులో పడేవాడే. లేకపోతే తనకుకూడా ప్రేమ మొదలయ్యేదా?

రామారావు చదువు సాగక రూమ్‌కి తాళంపెట్టి, లైబ్రరీ వేపు బయల్దేరాడు. మళ్ళీ అవే ఆలోచనలు సుశీల ఉత్తరం గురించి. రేపు క్లాసులో సుశీల మొహం జాగ్రత్తగా చూడాలి. ఇతనేం రాస్తాడో జవాబు?




"ఏంటోయ్! ఎంత పిలిచినా పలకవేం?" అంటూ రామారావు భుజంమీద చెయ్యేశాడు. రవి కుమార్.

"పిలిచావా? వినపడలేదే?"

"ఏం అంత పరాకూ? నీకూ లౌ లెటర్ వచ్చిందా?"

"నీకూ అంటే? ఎవరికన్నా వచ్చిందా"

"ఎవరితోటీ అనకుగానీ. సుశీల సుధాకర్‌కి లౌ లెటర్ రాసిందోయ్."

నిర్ఘాంతపోయాడు రామారావు.

"ఎవరు చెప్పారు నీకు?"

"సుధాకర్ చెప్పాడు. చెప్పడం ఏంటి? నేను స్వయంగా చూశాను ఉత్తరం."

తెల్లబోతున్నాడు రామారావు.

"నమ్మవా నా మాట?"

రామారావు తనని తను సర్దుకోడానికి ప్రయత్నిస్తూ— "నమ్మకపోడానికేముంది ఇందులో? రాస్తే రాసుండొచ్చు" అన్నాడు.

"భలే రాసిందోయ్ - ఆశ్చర్యమేసింది చదువుతుంటే."

"ఏం?"

"ఆడపిల్లలు అంత సాహసం చేస్తారా"

"ఆడపిల్లలకి ప్రేమ రాదా? ఎవరికి ప్రేమ కలిగితే వాళ్ళు సాహసం చేస్తారేమో" రవికుమార్‌తో మాట్లాడుతున్నాడే గానీ సుధాకర్ చేసిన పని గురించి ఆశ్చర్యపోతున్నాడు రామారావు. సుశీల ఉత్తరం రవికుమార్‌కికూడా ఎందుకు చూపించాడు? చెప్పాలంటే, తనకన్నా రవికుమారే ఎక్కువ స్నేహితుడు సుధాకర్‌కి. ఎప్పుడూ కలిసి తిరుగుతూ వుంటారు. తనకే చూపించినప్పుడు రవికుమార్‌కి చూపిస్తే తప్పేమిటి? తను ప్రేమించినా, తనని ప్రేమించినా ఆ విషయాలు సిగ్గుపడి దాచుకోవలసిన విషయాలా? సుధాకర్ సంతోషంగానే చెప్పుకున్నాడేమో స్నేహితునికి? అతను చెప్పే చెప్పాడు. ఇతను మళ్ళీ ఇంకోరితో అనడం ఎందుకూ?

"సుశీల ఇలాంటిదని ఎప్పుడూ అనుకోలేదోయ్"

"ఇలాంటిదంటే?" చురుగ్గా చూశాడు రామారావు.

"అదే, ప్రేమించడం అదీ.... భలే రాసిందిలే. అమ్మాయిలందరూ ప్రేమలేఖలు రాస్తారంటావా? నోరు మూసుకుని పెద్దవాళ్ళు కుదిర్చిన పెళ్ళిళ్ళు చేసేసుకుంటారు."

"అబ్బాయిలూ అంతే. ఆ మాట కొస్తే అమ్మాయిలే చాలా సాహసం చేస్తారు."

"సాహసం అంటావా అది?"

"ఏం కాక?"

"అలా రాస్తే ఏం బాగుంటుందోయ్? పెద్దవాళ్ళకి చెప్పి వాళ్ళ ద్వారా అడిగించొచ్చుగా?"

"అయితే వాళ్ళ తాత వచ్చి వీళ్ళ తాతని అడగాలన్నమాట."

"ఏం కాదులే. వాళ్ళ నాన్నగారు వచ్చి వీళ్ళ నాన్నగార్ని అడిగితే మర్యాదగా వుంటుంది.

తాతలైతే నాన్నలకన్నా పెద్దవాళ్ళుగా? తాత వచ్చి అడిగితే ఇంకా మర్యాదకాదూ? ముత్తాత వస్తే మరీ మర్యాద."

"చాల్లేవోయ్ నీ మాటలూ."

"ఇంతకీ సుధాకర్ అభిప్రాయం ఎలా వుంది సుశీల గురించి? నీతో ఏమన్నా అన్నాడా?" అని రామారావు రవికుమార్‌ని అడుగుదామనుకున్నాడుగానీ, బాగుండదని వూరుకున్నాడు రామారావిలా అడిగాడ్ని

## పక్షులను చంపడం ప్రమాదకరం

పక్షులను వేటాడడం మానవ జాతి మనుగడకే ప్రమాదకరమని జర్మను సొసైటీ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు ఏనిమల్స్ అధ్యక్షులు డాక్టరు ఆంద్రియాస్ గ్రాస్ మూలర్ హెచ్చరిస్తున్నారు. పక్షులు పురుగులను తిని మన ఆహారాన్ని చీడల నుంచి రక్షిస్తాయి. పక్షులే లేకపోతే మన ఆహారం పూర్తిగా పురుగులతో నిండి వుంటుంది ప్రతి సంవత్సరం 20 నుంచి 25 కోట్ల పక్షులను చంపుతున్నారు. ఇదే కొనసాగితే భావితరాలవారు పక్షులను చూడగలరో లేదో చెప్పడం చాలా కష్టం. దీనివల్ల విపరీతమైన పరిణామా లేర్పడవచ్చు.

ఇతను మళ్ళీ అతనితో అంటే చాలా అసహ్యంగా వుంటుంది. ఆ మాట నన్నే అడక్కపోయాడా అని అతను అనుకుంటే? కావాలంటే అతన్నే అడగొచ్చు. ఏం జవాబు రాశావోయ్?" అంటే అతనే చెపుతాడు. ఆ మాత్రానికి ఇతర్లని అడగడం ఎందుకూ? అని వూరుకున్నాడు.

"ప్రేమ అంటే ఏంటి గురూ? మొగాళ్ళతో తిరగాలనిపిస్తుందా?" అన్నాడు రవికుమార్ నవ్వుతూ.

రామారావు కొంచెం ఆశ్చర్యంగా చూశాడు రవికుమార్ని. సుశీల వుత్తరం చదివితే "మొగాడితో తిరగాలనే" అర్థమే కనిపించిందా ఇతనికి?

"ఇంకెవరూ అనలేదా గురూ ఆవిడ కళ్ళకి?

ఆయన కాస్త కవిత్వం, గివిత్వం వొలికిస్తాడుకదా?"

"ఏయ్! రవికుమార్?" అని ఎవరో పిలిచారతన్ని.

"వొస్తా గురూ!" అంటూ రవికుమార్ వాళ్ళ వేపు గబగబా వెళ్ళిపోయాడు. అతని వుత్సాహం చూస్తే "వాళ్ళతో కూడా చెపుతాడా?" అని ఒక్కసారి గుండె గబగబ కొట్టుకుంది రామారావుకి. మళ్ళీ వెంటనే- "ఛ ఎందుకు చెపుతాడు!" అని శాంత పడ్డాడు.

"సుధాకర్కి ప్రేమలేఖ వచ్చిందంటే ఇతనికి అసూయగా వుందా? ఇంకెవరూ అనలేదా ఆవిడ కళ్ళకి?" అంటాడేవిటి?-

ఆశ్చర్యంతో తలమునక లవుతున్నాడు రామారావు. సుధాకర్ని తన క్లోజ్ ఫ్రెండని చెప్పుకుంటాడు. సుధాకర్ కవిత్వం యింత గొప్పదనీ, అంత గొప్పదనీ పొగుడుతాడు. "ఆయన కవిత్వం. గివిత్వం వొలికిస్తాడు కదా" అని అంత వెటకారంగా మాట్లాడతాడేవిటి? అని రవికుమార్ మాటలు తల్చుకుని ఆశ్చర్య పడ్డాడు రామారావు.

"ఇలాంటివాణ్ణి ఎలా నమ్ముతున్నాడు సుధాకర్? సుధాకర్ని చూసి యితనింత కుళ్ళుకుంటున్నాడా? పాపం యితనేదో మంచి స్నేహితుడని సుధాకర్ భ్రమపడుతున్నాడే!"

సుధాకర్ని గురించి ఆలోచిస్తోంటే మధ్యాహ్నం అతనువేసుకున్న చారలషర్టు గుర్తొచ్చింది ఎందుకో. మధ్యాహ్నమేఅనిపించింది. ఏమిటంత జీబ్రా చారలని. సుధాకర్ యెప్పుడూ జీబ్రా చారల షర్టులు నావళ్ళ గళ్ళషర్టులు వేస్తాడు. అతని బట్టల సెలక్షన్ రామారావుకి నచ్చదు. అతని బట్టల గురించి సుశీల యేమనుకుంటుందో! ఏ క్షణాల్లో ఆమె మనసుని ఆకర్షించాడో! ఒకసారి ఇష్టం కలిగితే ఏ బట్టవేసినా, ఎలా ప్రవర్తించినా అందంగానో ముద్దుగానే కనపడుతుందేమో! కాంతి ఎక్కువైతే కళ్ళు చీకట్లు కమ్మినట్లు, ప్రేమ ఎక్కువైతే మనసు మూర్ఖం అయిపోతుందేమో! తను చెప్పనే చెప్పింది కదా సుధాకర్లో లోపాలు చూడలేనని.

సుధాకర్ గురించి ఇలా ఆలోచిస్తున్నానేమిటని ఆశ్చర్యపడ్డాడు రామారావు. తను కూడా అసూయపడుతున్నాడా కొంపదీసి సుధాకర్ని చూసి? లేకపోతే. అంతంత గళ్ళ షరులు వేసుకునే సుధాకర్ని సుశీల ఎలా ప్రేమించ గలిగిందని తను ఆలోచించడం ఏమిటి సుధాకర్లో ప్రత్యేకతే లేనట్టు?

రామారావు ఎనిమిది గంటల వరకూ లైబ్రరీలో కూర్చుని మెస్కి బయల్దేరాడు. దారిలో హిందీ డిపార్టుమెంటు మోహన్రావు కనపడ్డాడు. అతను రామారావుని నవ్వుతూ పలకరించి "ఇంత సేపు న్నారేం?" అన్నాడు నిలబెట్టి.

"ఏం లేదు. లైబ్రరీలో కూర్చున్నాను. వెళ్ళాను" అని రామారావు వెళ్ళబోతోంటే "మీ క్లాస్మేట్ సుశీల యెలాంటి మనిషండీ?" అని అడిగాడు.

రామారావు షాక్ తిన్నట్టు ఆశ్చర్య పడ్డాడు. 'అంటే?'

"చెప్పండి సుశీల గురించి మీకో న్యూస్ చెపుతాను."

"ఏం చెప్పాలి?"

## బ్రతుకు బరువు

శరత్కాలపు మబ్బుతునక
దూదిపింజలా శూన్యంలో ఎగురుతూ
గాలివాటుకి అనుకూలంగా చెదురుతూ
తన తేలికతనానికి చాలా
గర్వపడుతుంది!
కన్నీటిని మోసే వర్షా మేఘానికే
పిడుగులాంటి జీవితపు బరువు తెలుసు
గాలికి తేలిపోవడం కాదు
గాలికి కరిగిపోవడం తెలుసు-
శూన్యంలో
గర్వంగా
ఎగిరిపోవడం కాదు
లోతుగా
నేల గుండెల్ని పండించడం తెలుసు.

—అద్దేపల్లి రామమోహనరావు

---

"సుశీల యెలాంటిది?"

"నాకేం తెలుసు?"

"క్లాస్మేట్ గురించి ఆ మాత్రం తెలీదా? ఆ అమ్మాయి సుధాకర్కి లౌలెటర్ రాసిందండీ."

"మీకెలా తెలుసు?"

"ఆ లెటర్ నా కళ్ళతో నేను చూస్తే."

"సుధాకర్ మీకు బాగా ఫ్రెండా?"

"ఆఁ-ఫ్రెండే అనుకోండి. ఎంత సిగ్గు లేకుండా రాసిందనుకున్నారు! ఎంత అమాయకురాల్లా కనపడుతుందో పైకి!"

అతని మాటలు వినడంలేదు రామారావు.

(ఇంకా వుంది)

